

దొంగోట్లతో గెలవాలనుకోవడం దారుణం

బోగస్ ఓట్లను వెలికితీసిన వామపక్షాలు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో అనర్హులను పట్టాభద్రుల ఓటర్లుగా నమోదు చేసిన అధికార పార్టీ అరాచకాలను వామపక్షాలు సాక్ష్యాలతో సహా బహిర్గతం చేశాయి. యశోదనగర్‌లోని ముగ్గురున్న ఓ ఇంటిలో 18 మందికి ఓటు హక్కు కల్పిస్తూ పట్టభద్రుల ఓట్లు నమోదు చేయడాన్ని పసిగట్టిన సిపిఎం, సిపిఐ నాయకులు బుధవారం వాటిని బహిర్గతం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళీ, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ఒకే ఇంటిలో ఓ మహిళ పేరు పెట్టి, భర్తల స్థానంలో 18 మంది పేర్లు పెట్టి దొంగ ఓట్లు చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది దారుణమైన విషయమన్నారు. ఆ మహిళను, వారి కుటుంబాన్ని సైతం కించపరిచేలా వ్యవహరించిన వ్యక్తులను ఉరి తీసినా పాపం లేదన్నారు. ఇలాంటి అక్రమాలు తిరుపతి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికంగా జరిగినట్లు తాము గుర్తించామన్నారు. అసలు అక్షర జ్ఞానం కూడా లేని వ్యక్తులను పట్టభద్రులుగా గుర్తించి ఓటు హక్కు ఇవ్వడం, పైగా నిజమైన పట్టాభద్రులకు ఓటు హక్కును కల్పించక పోవడం శోచనీయమన్నారు. అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి దొంగ ఓట్లను వెలికి తీస్తామని, దొంగోట్లు వేసేందుకు వచ్చే వారిని నిలువరించాలని సూచించారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, జయచంద్ర, బుజ్జమ్మ, సిపిఐ నాయకులు హరినాథ్‌రెడ్డి, పి.మురళీ, విశ్వనాథ్, నాయకులు, డిఎంసి బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల జోలికి వస్తే ఊరుకోం..

భూ ఆక్రమణలను అడ్డుకుంటే దాడులు చేస్తారా: ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్




విచారణ జరుపుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భూకబ్జాలను అడ్డుకుంటే దాడులు చేస్తారా దళితుల జోలికి వస్తే ఖబద్దారంటూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. గతనెల 26వ తేదీ 49వ డివిజన్ చౌటపల్లి సచివాలయం వద్ద ఐదుగురు దళితులపై అగ్రవర్ణాల దాడిపై బుధవారం ఉప్పన్నగారిపల్లిలో బాధిత దళితులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాధిత దళితులను వెంకటేష్, రమేష్, చైతన్యలు కలిసి వివరాలను ఎస్సీ కమిషన్ చైర్మన్ దష్టికి తీసుకువచ్చారు. దళితుల భూములను ఆక్రమించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. అలాగే స్మశాన వాటికల దారిలో నాక్రమిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరినట్లు తెలిపారు. కోడిగుట్ట వద్ద చోటు చేసుకున్న సంఘటనలు బాధ్యతలకు న్యాయం చేసేలా పోలీసులు వ్యవహరించడం లేదని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ దళితులకు అన్యాయం సహించేంది లేదని అన్నారు. ఆక్రమణకు గురైన, విక్రయించిన దళితుల భూములను వెన్నకుతీసుకొనేలా జిల్లా కలెక్టర్‌తో చర్చించిన్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా స్మశానస్థలాలు ఆక్రమణదారులు ఆక్రమణలపై జిల్లా యంత్రాగం చర్యలు తీసుకొనేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్ కృషి చేయనున్నట్లు చెప్పారు. దళితుల భూములను ఆక్రమిస్తున్నారని ప్రశ్నించిన దళితులు ఐదుగురిపై గత నెల 26వ తేదీ జిల్లా కేంద్రమైన చిత్తూరు కోడిగుట్ట వద్ద ఉన్న 49వ సచివాలయం వద్ద అధికారపార్టీకి చెందిన కొందరు రౌడీలతో దళితుడైన వెంకటేష్, రమేష్, చైతన్యలతో పాటు మరో ఇద్దరిపై దాడి చేసిన వారిపై పోలీసులు హత్యయత్నం కేసులు పెట్టకపోవడం ఎమిటని ప్రశ్నంచారు. వెంటనే దాడిచేసిన వారిపై కేసులు పెట్టాలని ఎస్సీ కమిషన్ ఛైర్మెన్‌గా బాధితుల పక్షాన పోరాటం చేయనున్నట్లు స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఇందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎంఆర్‌పిఎస్, దళిత సంఘాల నేతలు, దళితులు పాల్గొన్నారు.

అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగొద్దు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గూడూరు: అధికారులు అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగితే ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గూడూరులోని సిఐటియు కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్నికల సమీక్షా సమావేశం జోగి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛగా ప్రజాస్వామ్య పద్ధతిలో అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎన్నికల కమిషనర్ పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాకాకుండా అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగిపోతే ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై ప్రతిఘటిస్తారన్నారు. టీచర్లను, ఉద్యోగులను భయపెట్టి ఓట్లు గుంజాలని అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోందని, ఇది మంచిది కాదని ఉద్యోగులలో, పట్టభద్రుల్లో, నిరుద్యోగుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నిరాశకు గురవుతున్నారన్నారు. పిఆర్‌సి సందర్భంగా ఒక్కో ఉద్యోగికి ఏడాదికి 20 లక్షలు నష్టం వచ్చిందని, అధికార పార్టీ డబ్బులు ఇచ్చి ఓట్లు కొని గెలవాలనుకోవడం ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అభ్యర్థులను తప్పక ఓడిస్తారన్నారు. నకిలీ ఓట్లను సృష్టించి, ఏజెంట్లను బెదిరించి, ఓట్లను వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, నకిలీ ఐడి కార్డులు తయారు చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ అక్రమ పద్ధతులను ఎన్నికల కమిషనర్ నివారించాలన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదన్నారు. నాడు-నేడు పేరుతో ఉన్న స్కూళ్లను తగ్గించి, ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు తెచ్చి, వాళ్లకి నిద్ర ఆహారం లేకుండా సృష్టించారన్నారు. మొన్న విశాఖపట్నంలో 13 లక్షల కోట్లు తెచ్చాం వస్తున్నాయి ఉద్యోగాలు, అందరికీ ఇస్తాం, అనే ప్రకటనలు తప్ప ఒరిగిందేమీ లేదని, ఈ ప్రకటనలతో నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సిపియం రాష్ట్ర కమిటి సభ్యులు నెల్లూరు యాదగిరి, సి.పి.యం. పార్టీ రాష్ట్ర నాయకులు మిరియం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించండి : రైతుసంఘం

కెవిబిపురం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వర్ రెడ్డి ని మండలంలోని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, కెవిబిపురం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ప్రచారం నిర్వహించారు. కళత్తూరు పంచాయతీ పరిధిలో ప్రతి పట్టభద్రుని ఇంటికి వెళ్లి పిడిఎఫ్ అభ్యర్థులను ఎందుకు గెలిపించాలో ఓటర్లకు వివరించారు. వరుస నంబర్ 21కి ఎదురుగా 1 అనే నంబర్ వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.బాబురెడ్డి వరుస నంబర్ 6 ఎదురుగా 1 నంబర్ వేయాలని విజ్ఞప్తి చేశారు.

స్త్రీ లేనిదే సృష్టి లేదు

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా పోలీసులను సత్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి- యంత్రాంగం:

చిత్తూరుఅర్బన్: స్థానిక దిశ మహిళా పోలీస్ స్టేషన్‌లో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ జగదీష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అలాగే వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులు మహిళా దినోత్సవం నిర్వహించారు.

ఏపీ ఎన్‌జీవో సంఘం నేతృత్వంలో స్థానిక ఎన్‌జీవో భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డిఆర్‌డిఎ పిడి తులసి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగం చేస్తున్న మహిళాలు సమస్యలను సమర్ధవంతంగా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకొని ఎన్‌జీవో సంఘం మహిళలకు క్రీడా పోలీసులు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం అభినందనీయమన్నారు.

మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన జేవివి



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవిజ్ఞావేదిక నేతృత్వంతో స్థానిక విజయం డిగ్రీ కళాశాల్లో నగరంలోని ప్రైవేటు విద్యాసంస్థంలో పనిచేస్తున్న మహిళా సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ రామలక్ష్మి, పాపుదేశి పౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి, విజయం విద్యా సంస్థల కరెస్పాండెంట్ శైలజామూర్తి, జేవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి హేమాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, వేణుగోపాల్, విజయకుమార్, త్యాగరాజుల నాయుడు, సుశీల పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు: సివిల్ జడ్జి

యాదమరి: ఆడపిల్లలకు విద్యఎంతో అవసరమని విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అని సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని గాబ్రియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని పాఠశాల కరస్పాండెంట్ రూబన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యాదమరి తహశీల్దార్ చిట్టిబాబు, కార్మికశాఖ అధికారి జగదీష్, అడ్వకేట్ భానుశేఖర్ రెడ్డి, హెచ్‌ఎం గీత, రేచల్ సౌమ్య, గ్రాయత్రి పాల్గొన్నారు.




యాదమరిలో సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

పట్టుదలకు మారుపేరు మహిళలు: ఏపిఎం శివ

సోమల: పట్టుదలకు మారుపేరు మహిళలని ఏపిఎం శివ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని వెలుగు సమాఖ్య కార్యాలయంలో సంఘమిత్రలు, వీవో లీడర్లు, పలువురు సంఘాలలోని మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలు, ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

సోమల మండల కేంద్రమైన సదుం గ్రామంలోని తపాలా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో పనిచేయుచున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించి వారికి స్వీట్లు పంచిపెట్టారు. మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల సిబ్బంది పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఏడుగురు మహిళ ఉపాధ్యాయులకు దశ్యాలతో సన్మానం చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివరత్నమ్మ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.



సోమలలో..

పుంగనూరు: మహిళలు అన్ని రంగాల్లో సమానత్వం కోసం ముందడుగు వేయాలని ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ చైర్‌పర్సన్, ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ చరణ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మహిళా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సమక్షంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జశ్వంత్ రాయల్, డాక్టర్ గ్రీష్మ, బిందు, సిబ్బంది పాల్గొన్నారు.



పుంగనూరులో..

టిడిపి కార్యాలయంలో.. ఎక్కడైతే స్త్రీలు పూజించి, గౌరవించబడతారో ఆ కుటుంబం, ఆ దేశం పురోగతి సాధిస్తుందని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సతీమణి రేణుకారెడ్డి తెలిపారు. పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత నాగరాజు, వరలక్ష్మి, శివకుమారి, బేబమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

పలమనేరు ఎన్జీఓ హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పలమనేరు పరిరక్షణ సమితి, ఎన్జీఓ సంఘం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయురాలు ఇందిర, పత్తికొండ వైద్యాధికారి సర్తాజ్, ఎన్జీఓ సంఘం కార్యదర్శి జయమ్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగేశ్వరి, మాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సునంద పాల్గొన్నారు.

వికోట: లైన్స్ క్లబ్ అధ్యక్షులు సురేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఏకే కళ్యాణమండపంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో విశిష్ట సేవలను అందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మహిళలను సన్మానించి బహుమంతులు అందజేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

వైఎస్‌ఆర్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి

చిత్తూరుఅర్బన్: వైఎస్ జగన్ మహిళా సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నట్లు వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా లీనారెడ్డి మాట్లాడుతూ నేడు జగన్‌మోహ్మన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లతో ప్రజాప్రతినిధులుగా మహిళలు రాణిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మహిళా సాధికారిత కోసం కృషి చేయనున్నట్లు చెప్పారు.

కార్వేటినగరం: స్త్రీ శక్తిని గుర్తించడానికి ఒక్కరోజు సరిపోదని, కొన్ని యుగాల నుండీ నేటి వరకు స్త్రీతత్వాన్ని, అమ్మతనంలోని ప్రేమమూర్తిని, అక్కచెల్లెళ్లలోని అనురాగాన్ని, భార్యలోని అనుబంధాన్ని ఆరాధించడానికి ఒక్కరోజు సరిపోదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఉమన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మదర్‌థెరిసా విద్యాసంస్థల అధినేత రవీంద్రబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా లింగాపురం సమీపంలో ఉన్న మదర్ థెరిసా విద్యా సంస్థలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులు సుమారు 200 మందిని సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ కుమారి శ్రేయ, డీన్ డాక్టర్ మధుసూదనారెడ్డి, ప్రిన్సిపాల్ డేవిడ్ పాల్గొన్నారు.

గంగవరం: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీవాణి అండ్ పద్మావతి కళాశాల యాజమాన్యం బుధవారం మండలంలోని కీలపట్ల దేవాలయం అన్నదాన స్థలానికి భూమిని దానం చేసిన మహిళలను ఘనంగా సత్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి తెలియజేశారు.



వికోటలో..

నగరి : మహిళలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాదులని మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులను ఆయన దుస్సాలువలతో సత్కరించారు.

సమస్యలు సమర్థవంతగా ఎదుర్కొవాలి

చిత్తూరుఅర్బన్: సమస్యలను మహిళలు సమర్ధవంతంగా ఎదుర్కొవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోహోంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో చైతన్య మాట్లాడుతూ నేడు అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారని శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో అనేక సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. మహిళలు పని చేసే ప్రదేశాలు చట్ట ప్రకారం కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందన్నారు. ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని సూచించారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి

పలమనేరు: మహిళలు వారి కోసం కేటాయించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరీ తెలిపారు. పలమనేరు సిల్క్ ఫారం కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి జయంతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సాధికారితపై అవగాహన సదస్సు నిర్వహించారు. భువనేశ్వరీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, చట్టాలు, సేవల గురించి ప్రతి మహిళా తెలుసుకోవాలని, వాటి ఆధారంగా జీవించాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, ధనమ్మ, సరోజమ్మ, రత్నమ్మ, శాంతమ్మ, అమరమ్మ, పాల్గొన్నారు.



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న భువనేశ్వరి

సచివాలయ ఉద్యోగులకు

సర్వీస్ రూల్స్ ప్రకటించాలి

పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ ప్రకటించి రెగ్యులర్ టైంస్కేలు ఇవ్వాలని పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సూళ్లూరుపేట ఎంఎల్‌సి ఎన్నికల క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు రెండేళ్లు సర్వీసు పూర్తి చేసినా రెగ్యులర్ టైంస్కేలును తప్పుబట్టారు. రెండేళ్ల ప్రొబేషనరీ కాలంలో రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నేరుగా మినిమం బేసిక్ ఇచ్చి ఆర్థిక నష్టం చేయడం అన్యాయమన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఛానల్ ఏమిటో స్పష్టత లేదని, జూనియర్ లైన్‌మెన్ విధులు, సమయపాలన విషయంలో స్పష్టత లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ సర్వేయర్లచే వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. వార్డు, శానిటరీ సెక్రటరీలకు నిర్దిష్ట పనివేళలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత దారుణంగా నష్టపోయారన్నారు. వార్డు వాలంటీర్ల సాధికారిత ఏమిటో చెప్పమని ఇటీవల హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో వారి మనుగడ ప్రశ్నార్థకమయ్యిందన్నారురు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారికి నిర్దిష్ట పని గంటలు, పనివిధానం కేటాయించి, సర్వీసు రూల్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే శాసన మండలిలో సచివాలయ ఉద్యోగులు సమస్యలపై నిలదీస్తానని అన్నారు.

ఆకట్టుకున్న సైన్సు ఎగ్జిబిషన్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: స్థానిక విజయం విద్యా సంస్థలో బుధవారం నిర్వహించిన సైన్సు ఎగ్జిబీషన్ పలువుర్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు 150 అంశాలకు సంబంధిన ప్రయోగాల నమూనాలను ప్రదర్శించారు. విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ సైన్సు పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకొని కొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలన్నారు. సైన్సు ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ నేటి ప్రపంచీకరణ యుగంలో సైన్సు విద్యార్థులకు అపారమైన ఉపాధి, విద్య అవకాశాలున్నాయని అన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. మనిషి జీవితంలో అడుగడుగునా విజ్ఞానంతో ముడిపడి వుంటుందని ప్రతిఒక్కరు ప్రకృతిలోని సమతుల్యాన్ని పాటించాలన్నారు. గతంలో ప్రతి ఆవిష్కరణ మనిషి జీవితాన్ని సౌకర్యవంతం చేసిందన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు తయారు చేసిన సైన్సు నమూనాలు



స్మార్ట్ మీటర్లు నిర్ణయం

ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం వల్ల ప్రయోజనం ఏమీలేదని ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ నివేదిక తేల్చి చెప్పిన నేపథ్యంలో స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఆదా కాలేదు.. సరికదా ప్రజాధనం వృథా అవుతోందని ప్రయాస్ రిపోర్టు పేర్కొందని మీడియా ద్వారా వెల్లడి అయ్యిందన్నారు. అనేకమంది విద్యుత్ నిపుణులు ఇంతకుముందే ఈవిషయం స్పష్టం చేశారు. అయినా ప్రభుత్వం ప్రయాస్ వారు తీసుకున్న ప్రాతిపదికలు సరికావని ప్రభుత్వం బుకాయించడం దారుణమన్నారు. ప్రయాస్ గ్రూప్ పూర్తి రిపోర్ట్‌ను ప్రభుత్వం ఇప్పటికైనా వెల్లడించాలని, అలా చేయకుండా ప్రాతిపదిక తప్పు అనడం 'ఆడలేక మద్దెల ఓడ'న్న చందంగా వుందని అన్నారు. రూ.6,500 కోట్లు ఖర్చుచేసి రాష్ట్రంలోని వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా ఉపసంహరించుకోవాలి. ప్రజా ధనాన్ని స్మార్ట్ మీటర్ తయారీదార్లకు, సాఫ్ట్‌వేర్ సర్వీసులు అందించే కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో వినాశకర విద్యుత్ సంస్కరణల్ని ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలుచేసి ప్రజాగ్రహానికి గురైందన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అవే విధానాలను అమలుచేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం చరిత్రను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకేగాక అన్ని కనెక్షన్లకూ 2025 నాటికి స్మార్ట్ మీటర్లు అమర్చుతామన్న నిర్ణయం వలన అత్యధికంగా ఉన్న జిల్లాలో వ్యవసాయ మోటార్ రైతు లు భారీ స్థాయిలో నష్టపోతారు. కావున ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి-క్యాంపస్: సాధారణ మహిళలు తమ ఇంటి పరిసరాలలో పుట్టగొడుగుల పెంపకంతో అధిక లాభాదాయాన్ని గడించవచ్చని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్లాంట్ పాంథాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.గురువిరెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని స్థానిక విజ్ఞాన కేంద్రం, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సహకారంతో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల ప్రయోజనార్థం ప్రత్యేకంగా గృహిణులకు పుట్టగొడుగుల విత్తన, పెంపకాలపై వర్క్‌షాప్‌ను రీజనల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిగడ్డిని క్రిమిరహితం చేయడం నుంచి స్పాన్ వ్యాప్తి చేయడంతో పుట్టగొడుగుల పెంపకానికి బ్యాగ్‌ని సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రదీప్





మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించి సంచులను ఎలా సిద్ధం చేయాలో వివరించారు. పుట్టగొడుగుల పెంపకాన్ని చిన్న స్థాయిలో, మార్కెటింగ్ పరిధిలో సెటప్ చేయడానికి సంబంధించిన సూచనలు అందించారు. మహిళలకు మష్రూమ్ కల్చర్ పెంపకం తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చేలా ఆరోగ్యకరమైన వ్యాపారం అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం అధికారులు ఎన్‌టి పురుషోత్తం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి సత్కారం



ప్రజాశక్తి-క్యాంపస్: శాసన మండలి ఎన్నికల్లో వడ్డెర కులానికి చెందిన ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర వడ్డెర జేఏసీ నేతలు ధన్యవాదాలు తెలుపుతూ, ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే మంత్రులు, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని రాష్ట్ర వడ్డెర జేఏసీ వైస్ ఛైర్మన్ గంజి శ్రీనివాసరావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు తురక అమరనాథ్‌ల ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, మహిళలు సత్కరించారు. ఈమేరకు స్పందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి వడ్డెర కులస్తులకు రాజకీయంగా పెద్దపీట వేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉండాలని తెలిపారు. చివరగా వడ్డెర సంఘం తరపున ఎలాంటి సహాయం కావాలన్నా తనకు తెలియపరిస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ వడ్డెర జేఏసీ నేతలు శ్రీనివాసులు, నరేష్, హరి తిరుమల, జయరామయ్య, విజయకుమార్, శివశంకర్, రఘునాథ్, బుజ్జిబాబు, రమణయ్య, మహిళలు ఉన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని గోపాలకష్ణపురం పంచాయతీలో మండల నిధుల నుండి రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి నేషనూరు సర్పంచ్ గోవింద్‌స్వామి రెడ్డి తో బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యంగా చేసి ప్రజలకు వెంటనే అందుబాటులోకి వచ్చేలా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య, ఎంపీటీసీ కాంతమ్మ, సర్పంచ్ వేలాయుధం, వైస్ సర్పంచ్ మునిరాజ, గహసారధులు కుప్పమ్మ, వార్డు మెంబర్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిలదీయండి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో నిలదీయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించినట్లు ఆ పార్టీ నగరి నియోజకవర్గం నాయకులు పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. బుధవారం యువగళం పాదయాత్రలో భాగంగా కలికిరిలో నారా లోకేష్ ను కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దష్ట్యా వారికి అండగా నిలిచి పోరాటం చేయాలని సూచించారు. అలాగే పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసినట్లు విజయబాబు తెలిపారు.

వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలి



ప్రజాశక్తి-కోట: ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులను నిర్వర్తించాలని మండలంలోని స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహ ఉద్యోగి గోపి బుధవారం తెలిపారు. బాలుర వసతి గృహంలో వాటర్ ట్యాంకు సున్నం రాలిపోయింది. దీన్ని పరిశీలించిన గోపి తక్షణమే హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సున్నం కొనుగోలు చేసి తనే వాటర్ ట్యాంకుకు సున్నాన్ని వేశాడు. దీంతో అతనికి హాస్టల్ అధికారులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. అనంతరం గోపి మాట్లాడుతూ హాస్టల్‌లోని విద్యార్థులకు మెరుగైన విద్య, పౌష్టికాహారం, మంచినీరు, మంచి వాతావరణం కల్పించడానికి ఉద్యోగులందరూ బాధ్యతతో పనిచేయాలన్నారు.

బ్యాలెట్ ఓట్లు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీ జరుగబోవు శాసనమండలి, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో విధుల్లో పాల్గొనే అధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మండల డిప్యూటీ తహశీల్దార్ శివయ్య విలేకరుల సమావేశంలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, డివిజినల్ కార్యాలయాలలోని పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి పర్యవేక్షణలో 10వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు వారి ఓటు హక్కును బ్యాలెట్ రూపంలో వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



ప్రజాశక్తి-రేణిగుంట: మామండూరు కేశవరెడ్డి ఈఎం స్కూల్‌లో బుధవారం హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు ఆ విద్యాసంస్థల ఫౌండర్ కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పండుగను సనాతన హిందూ ధర్మం ప్రకారం అనాదిగా జరుపుకుంటున్న పండుగ అని తెలిపారు. ప్రతి సంవత్సరం పాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీని చేసుకుంటాం. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రంగులు జల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో కోలాహలంగా బుధవారం హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. హోలీ పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులు నత్యాలు చేస్తూ పరస్పర రంగుల చల్లుకున్నారు. శ్రీకావ్య రాజపురం, సన్నగుంట గ్రామంలోని గిరిజనులు తన సాంప్రదాయబద్ధంగా పండుగలను జరుపుకున్నారు. చిన్నారులు ఉట్టికొట్టి రంగులు చల్లుకున్నారు.

అర్ధగిరిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాంపు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : నూతన ప్రదేశాల పట్ల అవగాహన పెంచుకునేందుకు సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు స్కౌట్ అండ్ గైడ్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం ప్రసూన తెలిపారు. మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా కాణిపాకం అర్ధగిరి ఆలయాల సందర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇతరులకు సహాయపడే విధంగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు పాఠశాలలోనే స్కౌట్ అండ్ గైడ్ ప్రారంభించారని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు నూతన ప్రదేశాలకు క్యాంపు వెళ్లడం వలన అక్కడి పరిస్థితులపై అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ, స్వీయ ఆలోచన, సమాజసేవ, ఆధ్యాత్మికత పెంపును స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పెంపొందించు కోవాలని అన్నారు. స్కౌట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిట్టడానికేనా లోకేష్ పాదయాత్ర : పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: చిన్నా, పెద్ద తేడా లేకుండా ఘోరాతి ఘోరంగా తిట్టడానికే లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారా? అని అనుమానం వస్తుందని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విమర్శించారు. తిరుపతిలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి 2014 మ్యానిఫెస్టో అన్ని చోట్ల డిలీట్ చేశారని, కావాలంటే లోకేష్‌కు ఒక కాపీ తాను పంపిస్తానని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫి, ఇంటికో ఉద్యోగం లాంటివి హామీ ఇచ్చారని, ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మళ్లీ అధికారం ఇస్తే మళ్లీ మాట తప్పరా అని విమర్శించారు. హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. లోకేష్ యాత్రలో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ఆపేస్తామని స్వయంగా ప్రకటించారని, పేద ప్రజలు చదువుకుంటే లోకేష్‌కు ఏమైనా ఇబ్బందా? అని ప్రశ్నించారు. పుంగనూరు నియోజకవర్గ



పరిధిలో దాదాపు పదివేల కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. తమ వైసిపి మ్యానిఫెస్టోతో లోకేష్ సెల్ఫీ తీసుకోవాలన్నారు. జగన్ హామీలు నెరవేరాయా అని పాదయాత్రలో అడిగి తెలుసుకోవాలని, చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హెరిటేజ్ కోసం మూసేసిన ప్రభుత్వ డెయిరీల వద్ద లోకేష్ సెల్ఫీలు తీసుకోవాలన్నారు.

మైక్రోబయాలజీ విద్యార్థుల ప్రయోగశాల ప్రదర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ యూనివర్సిటీలో న్యాక్ కమిటీ 3 రోజుల పర్యటన సందర్భంగా 2వ రోజు మైక్రోబయాలజీ విభాగాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ విభాగం విద్యార్థులు వివిధరకాల ప్రయోగాలు ప్రదర్శించారు. కూరగాయల పైన సూక్ష్మ జీవుల గణన, ఉపరితలంపై సాధారణ వక్షజాలం, మైక్రోకంపోస్ట్, పుట్టగొడుగుల సాగు, కరోనా వైరస్ నమూనా, వివిధ శానిటైజర్లతో ఆల్కాహాల్ ప్రభావం తదితర ప్రయోగాలను ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను, పరిశోధక విద్యార్థులను వారు అభినందించారు. న్యాక్ కమిటీ బంద సభ్యులు పరిశోధనలకు సహకరించినటు మైక్రోబయాలజీ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ సిహెచ్



పరమగీతమంను రైతులకు వ్యవసాయంలో లాభసాటి దిగుబడి వచ్చే పంటలపై ప్రయోగాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలి


ప్రజాశక్తి -పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలని, దీని ద్వారా మాతాశిశుమరణాలు తగ్గుతాయని వైద్యఅధికారి మోహన్ కష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణీలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణీలకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, హెచ్ఐవి వైద్యపరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులతో మాట్లాడుతూ ప్రసవ సమయం వరకు పౌష్టికారంతోపాటు పండ్ల రసం, కూరగాయలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఎండలతీవ్రత ఎక్కువగా కావడంతో బయట వచ్చేటప్పుడు గొడుగు సహాయంతో రావాలని తెలిపారు. ఓఆర్ఎస్ తీసుకోవాలని



సూచించారు. అనంతరం 25మంది గర్భిణీలకు, 10 చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుశీల, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లూయిడ్ జ్వరాలపై అపోహాలు వద్దు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఫ్లూయిడ్ జ్వరాలపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్3, ఎన్2 వైరస్‌వల్ల జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలని సూచించారు. ఈ వైరస్ వల్ల కలిగే ఇబ్బందులు వారం రోజుల పాటు ఉంటుందని ఎవ్వరూ ఆపోహాలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఆర్ఎంపీలు హైర్ యాంటీ బైటిక్ ఎక్కువగా వాడుతున్నారని, వాటి వల్ల ఎవ్వరికైనా ప్రమాదం జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ లక్షణాలు ఒక్కరికి ఉంటే ఇంటిల్లో అందరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ మాస్కులు తప్పనిసరిగా వాడాలన్నారు. అనంతరం వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. రకాలైన వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సిబ్బంది హాజరు పట్టికను, మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ పాండియన్, పర్యవేక్షకులు అంబారిషీరాజు. పలువురు వైద్య సిబ్బంది,ఉన్నారు.



టీవీ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వారి జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్కే ఎంటర్ప్రైజెస్ వారి సహకారంతో నిరుద్యోగ యువతీయువకులకు రేణిగుంట సమీపంలోని డిక్సన్ కంపెనీలో ఎలక్ట్రానిక్ టీవీ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాల కొరకు ఈనెల 9వ తేదీ గురువారం కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవ తరగతి పాస్, ఫెయిల్, డిప్లమా, ఐటిఐ పాస్, ఫెయిల్, ఇంటర్ పాస్, ఫెయిల్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 19 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు వయసు కలిగిన అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు అభ్యర్థుల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌం ట్ పాస్‌బుక్ జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకు రావలసింది గా కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,500 నుండి 14,0 00ల వరకు జీతం ఇవ్వనున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు 98403 32850, 96404 08264 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దొంగ ఓట్లపై విచారణ చేపట్టండి

పోలీసు స్టేషన్ ఎదుట టిడిపి నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటి : ఈనెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేసిందని, వాటిపై విచారించి కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల తెలుగుదేశం పార్టీ పరిశీలకులు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పైన ఆక్నాలెజిమెంట్ ఇవ్వాలని పోలీసులను డిమాండ్ చేస్తూ అక్కడే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో 30వ డివిజన్ నందు 4-4-562 డోర్ నెంబర్ పేరుతో 232వ బూత్ నందు సీరియల్ నెంబర్ 583 నుండి 625 వరకు వరుస నెంబర్లతో 38 ఓట్లు ఒకే డోర్ నెంబర్ పై నమోదు చేయడం జరిగిందని వివరించారు. అలాగే వైఎస్ఆర్‌సిపి పశ్చిమ పార్టీ కార్యాలయంగా తాము గుర్తించడం జరిగిందని తెలియజేశారు. పార్టీ ఆఫీస్ డోర్ నెంబర్ లో గ్రాడ్యుయేట్స్ ఓటరుగా నమోదు చేయించారని అందులో డిగ్రీ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసి గ్రాడ్యుయేట్స్ ఓటరుగా నమోదు చేయడం చట్ట విరుద్ధం అన్నారు . ఫోర్జరీ సర్టిఫికెట్లను సరి చూసుకోకుండా సంతకం చేసిన అధికారి బోగస్ వోటర్ కు సర్టిఫై చేయడం నేరం అన్నారు అదేవిధంగా బూత్ నందు బి.ఎల్.ఓ .అధికారి సంబంధిత ఓటర్లు ఆ డోర్ నెంబర్ లో నివాసం లేకపోయినా అతనికి గ్రాడ్యుయేట్స్ సర్టిఫికేట్ లేకపోయినా అధికార పార్టీ తో కలిసి ఓటరుగా చేర్చడం నేరం అన్నారు. బి .ఎల్. ఓ .తో పాటు సంబంధిత అర్బన్ మండలం తాసిల్దార్ భోగి సర్టిఫికెట్ల ను ఓటరుగా నమోదు చేయడం తో పాటు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరుగా చేరుతున్నప్పుడు అప్లికేషన్లో పొందుపరిచిన అన్ని అబద్ధాలు అసత్యాలని తేలితే శిక్ష అర్హులని తెలియజేశారు. ఇదేవిధంగా 232 బూత్ నెంబర్ లో 863 సీరియల్ నెంబర్లు జ్ఞానేశ్వరి, 864 సీరియల్ నెంబర్లు ధనలక్ష్మి ఉన్న వారితోపాటు 865 సీరియల్ నెంబర్లు ఉన్న సాహియానా వంటి వారు కూడా గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు లేకపోయినా కనీస చదువు లేకపోయినా వీరికి ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. ఓటు హక్కు కలిగిన వారితో తాము మాట్లాడటం జరిగిందని వారి ఫోన్లు కాల్స్ చేసినప్పుడు తమకు తెలియదని చెప్పడం జరిగిందన్నారు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలవాలని ఉద్దేశంతో అధికారి పార్టీకి చెందినవారు బోగస్ ఓట్లు చేర్పించారన్నారు. దీనిపైన తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో పాటు ఎన్నికల కమిషన్‌కు సమగ్రమైన విచారణ జరిపించాలని వాటికి సంబంధించి డాక్యుమెంట్లు సిడిలను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులతో పాటు వ్యక్తులను కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు. నియోజకవర్గ ఇన్చార్జి సుగుణమ్మ. పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఊకా విజయ్ కుమార్. కార్పొరేటర్ ఆర్.సి.మునికష్ణ. రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం
రూ.లక్ష ఆస్తి నష్టం

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో మామిడితోట అగ్నిప్రమాదానికి గురై సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. బుధవారం భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో ఉన్న మామిడి తోటలో అగ్ని ప్రమాదం సంభవించిందని చెప్పారు. పట్టణానికి చెందిన ఎస్.అబ్దుల్ కరీం సాహెబ్ కుమారుడు అబ్దుల్‌హలీంకు చెందిన మామిడి తోటలో 25 మామిడి చెట్లు అగ్ని ప్రమాదానికి గురై పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రమాదానికి కారణం ఎవరో గుర్తు తెలీని వ్యక్తులు బీడీ, సిగరెట్ ఆర్పకుండా పారేయడం వలన ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. ఈ ప్రమాద స్థలానికి అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను చుట్టుపక్కల వ్యాపించకుండా అదుపు చేశారు.

ప్రజల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి-దక్కిలి: మండలంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశ సభలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదరిమల్లి రామ్‌కుమార్ రెడ్డి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాబినెట్



హోదా లో బాధ్యతలు చేపట్టిన 6 నెలలు గడవక ముందే తిరుపతి జిల్లా బాధ్యతలు అందించారు. అనంతరం 2 నెలలు తిరగకముందే నియోజకవర్గ సమన్వయ కర్తగా నాపై నమ్మకంతో బాధ్యతలు అందించి నాపై జగన్మోహన్ రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తిరుపతి జిల్లాలో 7 నియో జకవర్గాల్లో గెలుపును అందిస్తాన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రజల అభివృద్ధికి కృషి చేసి పార్టీకి అత్యధిక స్థాయిలో మెజార్టీని అందించే విధంగా పనిచేస్తానన్నారు.

నేడు ఉపాధి హామీ బహిరంగ సభ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్, బహిరంగ సభను చిత్తూరులోని డ్వామా కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ దినకర్ బాబు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా బహిరంగ సభను చిత్తూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎల్ఐసి మహిళా ఉద్యోగులు కలిసి పిచ్చాటూరు వద్ధాశ్రమానికి బుధవారం రూ.10 వేలు విలువ చేసే నీటిశుద్ధి యంత్రాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తమ యూనియన్ సామాజిక కార్యక్రమాల్లో ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి భాను మహిళా ఉద్యోగులు రాజరాజేశ్వరి, ఇందుమతి, రమాదేవి, మాధవి, ఆశ్రమ నిర్వాహకులు త్యాగరాజు, యూనియన్ నాయకులు రమేష్ బాబు, షణ్ముగం, బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు దస్తగిరి, రామకష్ణ, ఢిల్లీ, వేలాయుధం, వెంకటేశ్వరరావు, రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విధ్వంసానికి బిజెపి కుట్ర: సిపిఐ

ప్రజాశక్తి-తిరుపతి సిటి: లౌకిక ప్రజాస్వామ్య విధ్వంసానికి బిజెపి కుట్ర చేస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దేశ అభివృద్ధిని పట్టించుకోకుండా మతాన్ని తెరమీదకు తీసుకొచ్చి, రాజకీయ పబ్బం గడుపుకుంటుందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులను చేస్తూ, అణిచివేయాలని చూస్తోందన్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు, నేతలపై పనిగట్టుకుని సిబిఐ, ఇడి, ఐటి తదితర సంస్థలచే దాడులు చేస్తోందన్నారు. బాబ్రీమసీదు మొదలు, నోట్ల రద్దు వరకు న్యాయస్థానాల తీర్పులన్నీ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఇస్తున్నారన్నారు. న్యాయమూర్తులు రిటైర్డు అవగానే వారికి పదవులు కట్టబెట్టడం దీనికి నిదర్శనమన్నారు. అదాని కంపెనీ వ్యవహారాలపై ఐదుగురు జడ్జీలతో కూడిన కమిటీ వేయగానే అదాని కంపెనీ స్వాగతం పలకడంలో అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ కమిటీ వేయగానే అదాని షేర్లు ఒక్కసారిగా పెరిగాయని గుర్తు చేశారు. అదాని పోర్టులను అభివృద్ధి చేసేందుకు రహదారులు వేస్తున్నారన్నారు. ఈ పోర్టులతో విదేశాల నుంచి గంజాయి రవాణా చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలోని అన్ని పోర్టులు బలవంతంగా లాక్కుంటున్నారని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాలు బొగ్గు కొనుగోలులో 20 శాతం కేంద్రానికి చెల్లించాలని చెప్పడం శోచనీయమన్నారు. దేశంలో విద్య, వైద్యరంగాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశ అభివృద్ధిని పక్కన పెట్టి, మతాన్ని నెత్తికెత్తుకుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశ వ్యాప్తంగా పోరాటం సాగిస్తామన్నారు. ఈ సమావేశంలో కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రామానాయుడు, మురళీ, జయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెదేపా అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి-తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామిని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. బుధవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నాడు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. తెదేపా నేత అశోక్ బాబు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

హస్తకళలను ఆదరించండి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: హస్తకళలను ఆదరించాలని నాబార్డు డిడిఎం సునీల్ కోరారు. స్థానిక వెంకుశా కళ్యాణ మండలంలో ఏర్పాటు చేసిన చేనేత, కళంకారి, హస్తకళా మేళాను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సునీల్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల నుండి చేనేత, హస్త కళ, కళంకారి చేతివృత్తిదార్లు నేరుగా అమ్మకాలు చేపడుతున్నట్లు చెప్పారు. బహిరంగ మార్కెట్ ఎక్కడా లభించని తక్కువధరలకు అమ్మకాలు చేపడుతున్నట్లు చెప్పారు. చేనేత, హస్తకళలను చిత్తూరు ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. భారత దేశం ప్రాచీన కళలను ఆదరిస్తారని హస్తకళలపై ఆదారపడ్డ కళాకారులను ఆదరించాలన్నారు. వస్త్రాలు, చెక్క బొమ్మలు, మహిళా ఆభరణాలు వంటి వస్తువుల ప్రదర్శన విక్రయాలు చేపడుతున్నట్లు చెప్పారు. చేనేత, హస్త కళామేళా నిర్వహకులు దశరధాచ్చారి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : గంగమ్మ జాతర, ఉగాది పండుగలను పురస్కరించుకొని మొగసాల కుటుంబసభ్యులు చిత్తూరు ఉమ్మడి జిల్లా స్థాయిలోని 65 మండలాల వాలీబాల్ క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన వారికి రూ.30,116లు, రెండో బహుమతి రూ.20,116లు, మూడో బహుమతి రూ.15,116లు, నాలుగో బహుమతి రూ.10,116 ఉంటుందని తెలిపారు. ఈసదవకాశాన్ని వాలీబాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి మండలం నుంచి ఒక్క టీముకు మాత్రమే అనుమతి ఉంటుందని, క్రీడాకారులు సంబంధించి మండలాల్లో నివసిస్తున్నట్లు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. అలాగే ప్రతి మండల టీంకు రూ.1000లు రవాణా ఖర్చులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 9వ తేదీ లోపు క్రీడాకారులు వారి టీములను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శ్రీవారి చక్రస్నానం

ప్రజాశక్తి -సోమల : మండలంలోని ఆవులపల్లె గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా బుధవారం స్వామివారి చక్రస్నాన వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం వెలుపల ఉంచి వారి ముందు చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన పవిత్ర జలంలో వేద మంత్రాల నడుమ చక్రస్నాన్ని నిర్వహించారు.

ఎస్వీ కాలేజీలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారతీయ సంస్కతిలో మహిళకు పూజనీయ స్థానం ఉందని, ఇక్కడ అణువణువునా స్త్రీ తత్వం ఇమిడి ఉందని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐఐఎస్ ఇ ఆర్ ప్రొఫెసర్ భాను శ్రీ రెడ్డి మాట్లాడుతూ మహిళకు దక్కుతున్న ప్రాధాన్యత దష్ట్యా భారతదేశంలో రోజూ మహిళా దినోత్సవమేనని అన్నారు. మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యంతోనే భారతదేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుందన్నారు. మహిళాశక్తిని జాగతం చేయడానికే ప్రతి సంవత్సరం అంతరాజతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని చెప్పారు. స్త్రీ చైతన్య స్వరూపమని, మహిళ ద్వారా కుటుంబం, తద్వారా సమాజం చైతన్యవంతం అవుతాయన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆధునిక సమాజంలో స్త్రీలు సాధించలేనిది ఏదీ లేదని అన్ని రంగాలలో అన్ని వత్తులలో పురుషులతో పాటు పోటీ పడుతూ తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారన్నారు. వారి పట్టుదల నిబద్ధత విలువ కట్ట



లేనిదని తెలిపారు. మహిళా సాధికారతతో ముందుకు సాగాలని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను వివక్ష లేకుండా విద్యా సంస్కతి, సాంప్రదాయాలతో సమానంగా పెంచాలని తెలిపారు. స్త్రీ ప్రకతితో సమానమని ప్రకతిని కాపాడుకోవడం మన బాధ్యతని తెలియజేశారు. సష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని, మహిళల శక్తి సామర్థ్యాలు అనిర్వచనీయమైనదని కొనియాడారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థినీ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.